క్లుప్తంగా

జనవరి 5న 'హైందవ శంఖారావం'

కాణిపాకం: హైందవ శంఖారావం పేరుతో జనవరి 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యుడు వేలు తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, దేవతా మూర్తులు, దేవాలయాలను కాపాడుకునే విషయంపై రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. హిందూబంధు జనులు పెద్ద సంఖ్యలో పాల్గొని సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటుకు సంఘీభావం తెలపాలని కోరారు.

మూగజీవాలకు నట్టల నివారణ మందులు



నట్టల నివారణ మందులు వేస్తున్న పశువైద్యాధికారి

గుడిపాల: నట్టల నివారణ మందుతో గొర్రెలు, మేకల్లో రక్తహీనతను నివారించడం సాధ్యమని పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. మండలంలోని 197రామాపురంలో మూగజీవాలకు నట్టల నివారణ మందును తాగించారు. ఆమె మాట్లాడుతూ, ఉచితంగా గొర్రెలు, మేకలకు నివారణ మందులను వేస్తామన్నారు. అంతర పరాన్నజీవులు కాలేయం, ఊపిరితిత్తులు, జీర్ణాశయం మొదలైన అవయవాల్లో తిష్టవేసి రక్తహీనతను గురిచేస్తాయని, వీటి బారిన నుంచి మూగజీవాల సంరక్షణకు నట్టల నివారణ మందులు విధిగా వాడాలని కోరారు. మండలంలో 10,385 గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు.

చెత్తాచెదారంతో నిండిన పూతలపట్టు చెరువు



చెరువులో ఉన్న చెత్తాచెదారం

పూతలపట్టు: మండల కేంద్రమైన పూతలపట్టులోని చెరువు చెత్తాచెదారంతో నిండిపోయింది. పంచాయతీలోని చెత్తను చెరువు వద్ద వేస్తున్నారు. వర్షానికి ఆ చెత్త నీటిలోకి చేరి నీరు కలుషితమవుతోంది. అంతేగాక చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చెరువులో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు బీరప్పచెరువులో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వైద్య బృందం గ్రామంలో పర్యటించి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు.

నివాళి

రామకుప్పం: వైఎస్సార్ సీపీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి అల్లుడు సోమశేఖర్ రెడ్డి ఆదివారం హఠాన్మరణం చెందారు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆకందగానిపల్లెకు చేరుకుని సోమశేఖర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం చంద్రారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్సీ భరత్ ఫోన్‌లో చంద్రారెడ్డిని పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వర్షాలకు నేలకొరిగిన వరి

కల్లూరు(పులిచెర్ల): తుపాను మూలాన కురిసిన వర్షాలకు చేతికొచ్చిన వరి పంట నేలకొరిగి నష్టపోయామని మతుకువారిపల్లె పంచాయతీ రైతులు ఆవేదన చెందుతున్నారు.

అన్నదాతా సుఖీభవ కోసం ఎదురుచూపు

ఆరుగాలం కష్టపడి సాగు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందక రైతులు ఇబ్బందులు పడుతూ ఉంటారు. ఒక్కోసారి వారికి పెట్టుబడి కూడా అందదు. చేసిన అప్పులు తీర్చలేక, అప్పు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారు. ఇది 2019–2024కు ముందు మాట. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకోవాలని సంకల్పించారు. వారికి రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.13,500లను బ్యాంకు ఖాతాలో జమ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకున్నారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి రైతులను నిలువునా ముంచింది. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ ప్రారంభమవుతున్నా పెట్టుబడి సాయం రూపాయి కూడా విదిల్చలేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.



ఖరీఫ్ సీజన్‌లో పూతలపట్టు మండలంలోని వరి పంట

- ఖరీఫ్ తుదిదశకు చేరినా రైతులకు అందని సాయం
- గత ప్రభుత్వంలో ప్రతి యేటా క్రమం తప్పకుండా జమ
- ఆవేదన చెందుతున్న రైతులు

పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గంలో 41,325 మంది రైతులు ఉన్నారు. సుమారు 13,300 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ వరి, రాగి, వేరుశనగ, మామిడి, టమాట, ఇతర కూరగాయల సాగు చేస్తున్నారు. గతంలో ప్రతి పనికీ రైతులు మండల కేంద్రంలోని వ్యవసాయ కేంద్రాలకు పరుగులు తీయాల్సివచ్చేది. దీంతో వ్యయప్రయాసలు పడేవారు. ఈ విషయాలను గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారికి స్థానికంగానే సౌకర్యవంతంగా సేవలు అందించేందుకు 96 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసింది. విత్తనాలు, పురుగు మందులను స్థానికంగానే అందజేయడంతోపాటు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు తెలియజేసేవారు. అంతేగాక పంటల సాగుకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టుకునేవారు. వారికి సాయం అందించాలనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా పథకాన్ని అమలుచేశారు. వారికి ఏడాదికి రూ.13,500లు పెట్టుబడి సాయం అందించారు. పూతలపట్టు నియోజకవర్గంలో 39,131 మంది రైతులకు రూ.149.24 కోట్లు బ్యాంకు ఖాతాలో జమచేశారు. దీంతో ఐదేళ్లు రైతులు ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేశారు. అంతేగాక గిట్టుబాటు ధరలు కూడా కల్పించడంతో రైతులు ఎక్కడా నష్టపోయిన దాఖలాలు లేవు.

అన్నదాతా సుఖీభవ పేరుతో మోసం

రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని చంద్రబాబునాయుడు, కూటమి నేతలు 2024 ఎన్నికల్లో బాకా ఊదారు. కూటమి ప్రభుత్వం వస్తే అకౌంట్ డబ్బులతో నిండిపోతుందని రైతులు ఆశపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఐదు నెలలు అవుతున్నా ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఎన్నో ఆశలతో రైతన్నలు ఖరీఫ్‌లో వివిధ పంటలను సాగుచేశారు. ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్న నమ్మకంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం ఎరువులు, పురుగుల మందుల రూపంలో రైతుపై భారం పడుతోంది. పెట్టుబడి సాయం కోసం ఎదురు చూపులు తప్ప ఫలితం కనిపించడం లేదు. దీంతో తాము చంద్రబాబు మాటలు నమ్మి మరోసారి మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కాలానుగుణంగా చేసిన సాయాన్ని గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

పథకం పేరు మార్చి మోసం



గతంలో ఉన్న రైతు భరోసా పథకాన్ని కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ అంటూ పేరు మార్చింది. ఏటా పెట్టుబడి సాయంగా రూ.20 వేలు వేస్తామని హామీ ఇచ్చింది. ఖరీఫ్ సీజను చివరి దశకు చేరింది. ఇంకా అన్నదాతా సుఖీభవ డబ్బులు వేయలేదు. చంద్రబాబునాయుడు మరోసారి మమ్మల్ని నిలువునా మోసం చేశారు.

–రాములు, రైతు, ఎదురుగుండ్లపల్లె, ఐరాల

డబ్బులు ఎప్పుడు వేస్తారు?



సీఎం చంద్రబాబు నాయుడు అన్నదాతా సుఖీభవ పేరుతో రూ.20 వేలు వేస్తామని చెప్పడంతో అప్పులు చేసి పంటల సాగుకు పెట్టుబడి పెట్టాం. ఎరువులు, పురుగుల మందు కొనడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. అన్నదాతా సుఖీభవ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించి డబ్బులు వేయాలి.

– హేమాద్రి, రైతు, తవణంపల్లి మండలం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తవణంపల్లె/ఐరాల: తవణంపల్లె మండల పరిషత్, ఐరాల తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రెడ్డిబాబు, తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. ఇందులో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

టీచర్ గాయత్రీదేవికి డాక్టరేట్



గాయత్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్: గుడిపాల మండలం చిత్తపార జెడ్పీ హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న కరణం గాయత్రీదేవికి తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఆమె ఆ వర్సిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ పి.హరిపద్మరాణి పర్యవేక్షణలో 'రీడింగ్ గ్రేడెడ్ మెటీరియల్స్ ఇన్ ఇంగ్లిష్: ఏ కేస్ స్టడీ ఆఫ్ ఛాలెంజస్ ఫేస్డ్ బై గవర్నమెంట్ స్కూల్ చిల్డ్రన్ ఎట్ ద సెకండరీ లెవెల్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆమె ఓవైపు ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే, మరో వైపు తన పరిశోధనలను పూర్తి చేసి త్వరలో యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకోనున్నారు. ఆమెను హరిపద్మరాణితోపాటు డీఈఓ దేవరాజులు, డీవైఈఓ చంద్రశేఖర్, గుడిపాల ఎంఈఓ–1 హసన్‌బాషా, ఎంఈఓ 2 గణపతి, చిత్తపార జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎంఆర్ శరవణ, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎప్పుడు?

చిత్తూరు కలెక్టరేట్: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని కొంగారెడ్డిపల్లెలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నప్పటికీ మహిళలకు ఇచ్చిన హామీ..ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేయకపోవడం మోసం చేసినట్లేనని మండిపడ్డారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ప్రశ్నిస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కాణిపాకం ఆర్టీసీ సర్వీసులో మహిళలకు టికెట్లు తీసిచ్చారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం హామీ నెరవేర్చకపోవడంపై చంద్రబాబు గురించి మహిళలు ఏమని భావిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పరదేశి, గోవర్ధన్‌రెడ్డి, కణ్ణన్, ఉమేష్, అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



కాణిపాకం వెళ్లే బస్సులో మహిళలకు టికెట్ కొనుగోలు చేసి అందజేస్తున్న భాస్కర్

భీముడికి బలం పుష్కలం

చిత్తూరు రూరల్(కాణిపాకం): భీముడికి బలం పుష్కలమని, వజ్ర శరీరం కలిగిన వాడని ఉపన్యాసకులు దండాల రాధాక్రిష్ణారెడ్డి అన్నారు. చిత్తూరులోని ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి చైతన్య సాహితి, హరివిల్లు లలిత కళావేదిక సంయుక్త నిర్వహణలో 'ఆంధ్ర మహాభారతంలో భీముడు' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భీముడు అత్యంత బలశాలిగా పేరొందాడన్నారు. భీమునికి 10 వేల ఏనుగు బలం ఉన్నట్లు మహాభారతంలో వర్ణించారన్నారు. ఉపాధ్యాయుడు అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ బలుడేనన్నారు. మంచి గుణం కలిగిన వాడు కూడా బలం కలిగిన వాడేనన్నారు. ఎవరికెవ్వరూ మనకు బలం లేదని తక్కువ అంచనా వేసుకోకూడదన్నారు. ఆలోచన అనే ఆయుధంతో బలంగా మారి కష్టాలను, నష్టాలను ఎదుర్కోవాలన్నారు. ప్రస్తుతం ఆత్మహత్యలు పెరిగాయని, ప్రతి ఒక్కరూ ఆలోచన అనే బలంతో సమస్యలపై ఎదుర్కొనేందుకు భీముడు బలంతో యుద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు పల్లేరు హరినాయుడు, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జయరామరెడ్డి, మునస్వామి, చైతన్య సాహితి, రాజరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రాధాక్రిష్ణారెడ్డి

యువతకు వాల్మీకి మహర్షి ఆదర్శం

పెద్దపంజాణి: వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని యువత సన్మార్గంలో నడవాలని బీసీ నాయకుడు దొరస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ నడింపల్లెలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో దొరస్వామి మాట్లాడుతూ, కులమతాలకతీతంగా వాల్మీకి మహర్షిని పూజించాలని, మహర్షి చూపిన సన్మార్గంలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. వాల్మీకి రాసిన రామాయణం మనిషి పరిపూర్ణ వ్యక్తిగా మారేందుకు దోహదం చేస్తుందన్నారు. సమాజంలో ఇప్పటికీ సభ్యత, సంస్కారం బతికి ఉన్నాయంటే అది ఆయన చలవేనన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఆ తర్వాత వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని సుందరంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి పలు గ్రామాలలో బ్యాండు వాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు శంకర్ కుమార్, రాధా, రాజశేఖర్, గంగాధర్, సురేంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.



నడింపల్లెలో వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్ ఊరేగిస్తున్న దృశ్యం

అధ్వానంగా యాదమరి – పరదరామి రోడ్డు



ఇరువారం చెక్ పోస్టు వద్ద గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

యాదమరి(పూతలపట్టు): యాదమరి – పరదరామి రోడ్డులో అడుగుకో గుంత పడడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా తమిళనాడులోని పరదరామి, వేలూరు తదితర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో వాహనాలు వెళుతూ ఉంటాయి. ముఖ్యంగా భారీ వాహనాల వల్ల రోడ్డు గుంతలమయమైంది. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలిచింది. దీంతో వాహనదారులు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఈ రోడ్డును బాగు చేయాలని అధికారులు, నాయకులను పలుమార్లు కోరినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సీసీ, బీటీ రోడ్లకు శంకుస్థాపన



సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గుడిపాల: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేలరాంబట్టి, పానాటూరు, రామభద్రాపురం, బసవాపల్లె, 197రామాపురం పంచాయతీల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆదివారం సీసీరోడ్లు, బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ, రూ.70లక్షల విలువైన సీసీ, బీటీరోడ్లు, శ్మశాన ప్రహరీ నిర్మాణాలకు భూమిపూజ చేశామన్నారు. గుడిపాలను స్మార్ట్ మండలంగా తీర్చిదిద్దుతానన్నారు. నియోజకవర్గానికి 250 క్యాటిల్ షెడ్లు మంజూరయ్యాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శివరాజన్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, నాయకులు హేమాద్రి, హరిప్రసాద్, సుమతి, మధుసూదన్‌నాయుడు, మురళి పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. నిర్వహించే ఈ కార్యక్రమంలో సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

చినుకు పడితే అంధకారమే!

గుడిపాల: మండలంలోని పలు గ్రామాల్లో చినుకు పడితే చాలు బ్రేక్‌డౌన్ సమస్యతో విద్యుత్ సరఫరా లేక అంధకారంలో మగ్గిపోతున్నాయి. రాత్రివేళ తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ట్రాన్స్‌కో సిబ్బంది పట్టణ ప్రాంతాల్లో నివాసముంటూ గ్రామాల్లో అందుబాటులో ఉండటం లేదు. దీనికితోడు సిబ్బంది కొరత వల్ల సకాలంలో లైన్ల పునరుద్ధరణ పనులు చేపట్టకపోవడంతో తరచూ బ్రేక్‌డౌన్ సమస్య తలెత్తుతున్నట్టు తెలుస్తోంది. రాత్రివేళల్లో బ్రేక్‌డౌన్ సమస్య ఉత్పన్నమైతే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు 10–15గంటల సమయం పడుతుండడంతో అంధకారంలో మగ్గిపోవాల్సి వస్తోందని గ్రామీణులు మండిపడుతున్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు మనుషులకు తగిలేంత ఎత్తులో వేలాడుతుండడం, కంపచెట్ల మధ్యలో విద్యుత్ తీగలు ఉండడం..మరిన్ని సాంకేతిక సమస్యల వల్లనే సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు విద్యుత్‌లైన్ల పనులను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ కరీముల్లా వివరణ కోరగా, బ్రేక్‌డౌన్ సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుని సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేస్తామన్నారు.



కోలావూరు వద్ద ఉన్న సబ్‌స్టేషన్

ప్రారంభానికి నోచుకోని ఆర్బీకే భవనాలు

తవణంపల్లె: గత ప్రభుత్వం ప్రజల వద్దకు పరిపాలన అందించాలనే సంకల్పంతో సచివాలయాలు ఏర్పాటు చేసింది. మండలంలోని 17 పంచాయతీల్లో సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు నిర్మించింది. కొన్ని సచివాలయాలల్లో స్థానికంగా నెలకొన్న సమస్యల కారణంగా పనులు చేపట్టలేదు. పల్లెచెరువులో కోర్టులో కేసు ఉండడంతో పనులు ఆగిపోయాయి. టి.పుత్తూరులో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు నిర్మాణం పూర్తయినా ఇప్పటి వరకు ప్రారంభించలేదు. వెంగంపల్లెలో సచివాలయ భవనం ప్రారంభం కాలేదు. పట్నం, పుణ్యసముద్రం, తవణంపల్లె గ్రామాల్లో సైతం పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులు చెల్లించడం లేదని, అందువల్లే భవనాలను వినియోగంలోకి తీసుకురావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



టి.పుత్తూరులో ప్రారంభానికి నోచుకోని రైతు భరోసా కేంద్రం భవనం



నేలకొరిగిన వరి పంట

ఐరాలలో భారీ వర్షం

- ఉధృతంగా ప్రవహిస్తున్న గార్గేయ నది

ఐరాల: మండలంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. దీంతో గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న రోడ్డుపైన వరద నీరు ప్రవహించడంతో రాత్రి అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. ఆదివారం ఉదయం వరద ఉధృతి తగ్గిన తర్వాత మార్గం గుండా రాకపోకలను పునరుద్ధరించారు. 35 యర్లంపల్లెలో భారీ వర్షానికి వరి పంట నేల కొరిగింది. వరి నీటిలో తడిస్తే రంగు మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించి నష్ట పరిహారం అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెద్దచెరువు కథ కంచికేనా..?

- వర్షాలకు కంపు కొడుతున్న పెద్దచెరువు కట్ట ప్రాంతం
- గత ప్రభుత్వ పాలనలో చెరువు సుందరీకరణకు కార్యాచరణ

పలమనేరు: పల్లవుల కాలం నాటి స్థానిక పెద్దచెరువుకు గత ప్రభుత్వ పాలనలో మహర్దశ ప్రాప్తిస్తుందని పట్టణ ప్రజలు భావించారు. ఆ దిశగా అప్పట్లో చెరువు సుందరీకరణకు ప్రభుత్వం పూనుకుంది. పట్టణంలోని మురుగునీరు చెరువులో చేరకుండా చేసేందుకు కార్యాచరణకు ఉపక్రమించింది. ఇందుకుగాను డైవర్షన్ చానెల్ పనులకు ఆమోదించి 14వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.5కోట్లు మంజూరు సైతం చేసింది. అలాగే టెండర్ల ప్రకియ సైతం అప్పట్లోనే మొదలైంది. మున్సిపల్ నిధులతో ప్రత్యామ్నాయ కాలువ (తాత్కాలికమైంది) పనులు సైతం అప్పట్లోనే మొదలయ్యాయి. దీంతోపాటు చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, కలర్ లైటింగ్, చెరువు మధ్యలో విగ్రహాన్ని ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తయారు చేసేందుకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అధికారుల ద్వారా రూ.6 కోట్లతో ప్రభుత్వానికి అంచనాలను పంపారు. ఇదంతా పూర్తయితే చెరువులోకి పట్టణ మురుగునీరు చేరకుండా మళ్లించి కాలుష్యరహిత చెరువుగా మార్చాలన్నదే ప్రధాన లక్ష్యం. తద్వారా సుందరీకరణతో పట్టణానికి పెద్దచెరువు మణిహారంగా మారుతుందని పట్టణ ప్రజలు భావించారు. అయితే ఆపై కోవిడ్ కష్టాలు, మళ్లీ సాధారణ ఎన్నికలు రావడంతో ఈ పనులు ఆగాయి. అయితే మొన్నటి ఎన్నికల్లో పలమనేరు పెద్ద చెరువు సమస్యపై తమ ప్రభుత్వం అధికారంలోకి దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి కార్యాచరణకూ పూనుకోలేదని ప్రజలు నిట్టూరుస్తున్నారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు మురుగు నీరంతా చెరువుకు చేరి మరింత దుర్గంధం చిమ్ముతోంది. కట్టపై చెన్నై–బెంగళూరు హైవేలో వెళ్లేవారు సైతం ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

అమరన్న మంత్రిగా ఉన్నప్పుడే పరిష్కారం కాని సమస్య ఇది!

పట్టణంలోని కొత్తపేట నుంచి వచ్చే మురుగునీరు మొత్తం గుండుబావి, ఆర్‌అండ్‌బీల వద్ద నుంచి చెరువులో చేరేది. దీంతో చెరువు నీరు కలుషితమై దుర్వాసన చిమ్మేది. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు దశాబ్దాలుగా పాలకులను కోరుతూనే ఉన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పలమనేరుకు ప్రాతినిధ్యం వహిస్తూ పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేసిన అమరనాథ రెడ్డి సైతం చెరువు సమస్యను పరిష్కరించలేకపోయారు. ఆపై అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవ చూపింది. రూ.5కోట్లతో చెరువు అభివృద్ధి, శాశ్వత పరిష్కారానికి ఈటీపీ(ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), రూ.6 కోట్లతో చెరువు కట్ట సుందరీకరణకు అంచనాలను సైతం సిద్ధం చేసింది. పనులు చేసేందుకు టెండర్ల ప్రక్రియను సైతం మొదలు పెట్టింది. ఆపై రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, ఈ సమస్యను అధికారంలోని పెద్దలు ఇప్పటికీ పట్టించుకోకపోవడంతో పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మురుగునీటితో దుర్గంధభరితమైన పలమనేరు పెద్ద చెరువు

చెరువులోకి వ్యర్థాలు వెళ్లకుండా చేయాలి

పట్టణంలోంచి చెరువులోకి మురుగునీరు చేరకుండా చెరువుకు తూర్పు వైపు తాత్కాలికంగా కాలువను నిర్మించారు. దీన్ని చెరువు కట్టకింద నుంచి పడమర వైపు ఉన్న మొరవ ద్వారా బొమ్మిదొడ్డి సమీపంలోని కౌండిన్యలోకి మళ్లిస్తున్నారు. చెరువులో కొంత నీరు తగ్గాక డైవర్షన్ చానెల్ పనులు చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తి చేస్తే దుర్గంధం నుంచి చెరువుకు విముక్తి కలుగుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ పనులకు పూనుకుని చెరువుకు పూర్వవైభవం తేవాలని కోరుతున్నారు.